క్లుప్తంగా

కరాటేలో తాడూరు విద్యార్థికి బంగారు పతకం



తాడూరు: ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ 20–24 టోర్నమెంట్‌లో భాగంగా తాడూరుకు చెందిన చంద్రశేఖర్ గోల్డ్‌మెడల్, ఆదిత్య వర్ధన్ సిల్వర్ మెడల్ సాధించారని కరాటే మాస్టర్ ఎర్రొళ్ళ వెంకటస్వామి సోమవా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న ఉ మ్మడి పాలమూరు జిల్లా కేంద్రంలో నిర్వహించిన కరాటే చాంపియన్‌షిప్‌లో ఈ మె డల్స్ సాధించారని, వారితో పాటు నాగర్‌క ర్నూల్‌కు చెందిన ఎండీ సమీర్ సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనిల్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలిక అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: బాలిక అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన బాలిక(16) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా సోమవారం వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో కోర్టు ప్రాంగణం శుభ్రం చేసే శిక్ష

పెద్దకొత్తపల్లి: ఈ నెల 3న పెద్దపల్లి గ్రామానికి చెందిన ఈశ్వర్ నాయనోనిపల్లి మైసమ్మ దేవతను దర్శించుకొని మద్యం తాగి డ్రంకెన్‌డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి సోమవారం కానిస్టేబుల్ రాము కొల్లాపూర్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి జ్యోత్స్నగుంటి ఆయనకు ఒక రోజు కోర్టు ప్రాంగణం శుభ్రం చేసే శిక్ష విధించినట్లు పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ సతీష్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్‌ఐ సూచించారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృత్యువాత

పెద్దకొత్తపల్లి: చెన్నపురావుపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృత్యువాత పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పిట్టల వెంకటస్వామి గేదె, దేశమోని వెంకటస్వామి గేదె గ్రామానికి చెందిన శివప్రసాద్ వ్యవసాయ పొలంలో అడవి పందుల కోసం వరిపైరు చుట్టు విద్యుత్ కంచెను ఏర్పాటు చేశాడు. రెండు గేదెలు మేత మేస్తూ వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి.

సగర సంఘం కమిటీ ఎన్నిక

తెలకపల్లి/వెల్దండ : మండలానికి సంబంధించిన సగర సంఘం తెలకపల్లి పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా సందిశెట్టి శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా మారంశెట్టి రఘుసాగర్, కోశాధికారి, మరికొంతమందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శీను, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొల్ల బాబుసాగర్ హాజరై మాట్లాడారు.

● వెల్దండ మండల కేంద్రంలో జిల్లా నాయకులు వావిలాల భీమయ్యసాగర్ ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఆలేటి నారాయణసాగర్, గౌరవ అధ్యక్షులుగా వెంకటేష్, ఉపాధ్యక్షులుగా ఆలేటి జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా ధ్యాప జంగయ్య, సహాయ కార్యదర్శిగా కొండ శేఖర్, కోశాధికారిగా మెరుగు రవీందర్, పచార కార్యదర్శిగా రాఘవేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు ఉన్నారు.

గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా కరుణ

కల్వకుర్తిరూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామ బీజేపీ అధ్యక్షురాలిగా కంకనాల కరుణను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని బూత్ నెంబర్ 59లో 225 మంది బీజేపీ సభ్యత్వం తీసుకోగా నలుగురు క్రియాశీల సభ్యులుగా సభ్యత్వం తీసుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు, నాయకులు త్వరితగతిన కమిటీలను ఎన్నుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని పార్టీ రాష్ట్ర నాయకుడు బండెల రామచంద్రారెడ్డి కోరారు.

పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలి

కోడేరు: మండల కేంద్రంలో కస్తూర్బా, గురుకుల పాఠశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వైద్య శిబిరాలు నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ సీజన్‌లో వివిధ రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, వైద్యాధికారులు స్పందించి అన్ని ప్రభుత్వ పాఠశాలలో వైద్య శిబిరాలను నిర్వహించాలని కోరుతున్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళా సంఘాల సభ్యులకు సబ్సిడీ కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న సబ్సిడీ పథకాలు సద్వినియోగం చేసుకోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రాచూర్ గ్రామానికి చెందిన దుబ్బా భారతమ్మ, నిర్మలకు మదర్‌యూనిట్ కింద సబ్సిడీలో మంజూరైన కోడి పిల్లలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రూ.2.91లక్షల విలువ చేసే కోడి పిల్లలు మంజూరైనట్లు తెలిపారు. సబ్సిడీలో ఒక్కొక్క సభ్యురాలికి 2వేల కోడి పిల్లలను అందజేసినట్లు తెలిపారు. మహిళలు సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోని స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలన్నారు. ఆయా కార్యక్రమాలలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ మెంబర్ సభ్యుడు బాలాజీసింగ్, పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, సూపరింటెండెంట్ రేవంతురెడ్డి, ఏఓ శోభారాణి, సీఈఓ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భారతమ్మ, డీపీఎం సుధాకర్, కార్యదర్శి బంగారమ్మ, జ్యోతి ఉన్నారు.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



చారకొండలో మాట్లాడుతున్న మేనేజర్ శేఖర్

చారకొండ: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్థికంగా పొదుపు పెంపొందిస్తూ వారికి అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం బాలచందర్, స్త్రీ నిధి మేనేజర్ శేఖర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఐకేపీ భవనంలో ఇందిర మహిళా శక్తిలో అమలవుతున్న పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఏపీఎం బాలచందర్, స్త్రీనిధి మేనేజర్ శేఖర్ హాజరై మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. సమావేశంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గోరటి సత్యమ్మ, కార్యదర్శి, అలివేలు, కోశాధికారి నిర్మల, సీసీలు విమల, మాధవి, ఆయా గ్రామాల సంఘం అధ్యక్షురాలు పాల్గొన్నారు.

రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి



ఆర్‌డీఓకు వినతిపత్ర అందిస్తున్న గోవర్ధన్‌రెడ్డి తదితరులు

కల్వకుర్తిరూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్‌డీఓ శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ యాసంగి పంటల సాగు సమయం వచ్చిందని, రైతులు వరి సాగు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సన్నరకంతో పాటు అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధర చెల్లించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రామస్వామి, అంజన్‌రెడ్డి, ధర్మారెడ్డి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగపై రైతులకు అవగాహన



వేరుశనగకు జిప్సంపై వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ భరత్‌కుమార్

లింగాల: రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటలో జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఓ భరత్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని సూరాపూర్, మగ్దుంపూర్ గ్రామాల శివారులో సాగు చేసిన వేరుశనగ పంటను సోమవారం ఏఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా వేరుశనగ సాగు చేసిన 45 రోజులకు పంటకు ఎకరాకు 200 కిలోల జిప్సం వేయాలని, దీని వల్ల దిగుబడి పెరుగుతుందని రైతులకు సూచించారు. వరిపంట కోసిన కొయ్యలను పంటలో అలాగే వదిలేయకూడదని, కొయ్యలను కాల్చకుండా ఎస్ఎస్‌పీ మరియు 10 నుంచి 15 కిలోల యూరియా చల్లు కోవాలని, దీని వల్ల డీ కంపోజింగ్ త్వరగా అయి కొయ్యలు కుళ్లి భూమి సారంతవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు రవి, జైపాల్, శివ ఉన్నారు.

గ్రూప్–3 పరీక్ష కేంద్రాల పరిశీలన



గోవర్ధన్ డిగ్రీ కళాశాలలో హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న అధికారులు, పోలీసు అధికారులు

తెలకపల్లి: టీఎస్‌పీఎస్‌సీ నిర్వహించిన గ్రూప్–3 పరీక్షలు రెండోరోజు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని ఆరు కేంద్రాలలో అభ్యర్థులు పరీక్షలు రాశారు. శాంతినికేతన్ పాఠశాలలో 288 మందికి 165 మంది హాజరు కాగా, 93 మంది గైర్హాజరయ్యారు. కేకేరెడ్డి పాఠశాలలో 312 మందికి గాను 212 మంది హాజరు కాగా, 100 మంది గైర్హాజరయ్యారు. బాలికల గురుకుల పాఠశాలలో 240 మందికిగాను 163 మంది హాజరు కాగా, 77 మంది రాలేదు. తెలకపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 227 మందికి 130 మంది హాజరు కాగా, 80 మంది గైర్హాజరయ్యారు. మహాత్మాజ్యోతిరావుపూలే బాలు ర పాఠశాలలో 312 మందికి గాను 214 మంది హాజరు కాగా, 98 మంది రాలేదు. గోవర్ధన్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో 384 మందికిగాను 268 మంది హాజరు కాగా, 116 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఎస్‌ఐ నరేష్‌తో పాటు పలువురు అధికారులు ఆయా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు వారు తెలిపారు.

పశుగణన ప్రక్రియ ప్రారంభం



తాడూరు: మండలంలో పశుగణన ప్రక్రియను ప్రారంభించినట్లు పశు వైద్య అధికారి డా.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో భారత్‌పశుదాన్ యాప్‌లో రైతుల పశుసంపద వివరాలు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది లక్ష్మి, సల్మా, జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: ప్రభుత్వం చేపట్టిన పశుగణనకు రైతులు సహకరించాలని పశువైద్యాధికారి డాక్టర్ శివకుమార్ తెలిపారు. మండల కేంద్రంలో పశుగణన చేపట్టారు. ఈ సందర్భంగా పశువైద్య అధికారులు, సిబ్బంది రైతుల నుంచి సంబంధిత పశువులు, గొర్రెలు, మేకలు తదితర వాటిని నమోదు చేపట్టారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ షేక్ మదర్, ఎల్ఎస్ఏ వెంకటేశ్వర్లు, సిబ్బంది శివరాం ఉన్నారు.

ఆశా వర్కర్లకు పారితోషికం చెల్లించాలి



జిల్లా వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా వైద్య రంగంలో పని చేస్తున్న ఆశా వర్కర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన మెటీరియల్ ఖర్చుల పారితోషికాన్ని తక్షణమే చెల్లించాలని సోమవారం జిల్లా వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇంద్రధనస్సు సర్వే చేసిన మహిళలు, ఆశలు మాట్లాడుతూ ప్రభుత్వం ఇంద్రధనస్సు సర్వేకు సంబంధించిన డబ్బులు చెల్లించలేదన్నారు. కంటి వెలుగు, లెప్రసీ సర్వే, పల్స్ పోలియో, టీబీ సర్వే నిర్వహించినప్పుడు ఒక రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఉద్యోగులతోపాటు ఆశా వర్కర్లకు ఎలక్షన్ విధుల డ్యూటీ నిర్వహిస్తే ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ఆశలకు రావాల్సిన పారితోషికాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, ఆశా వర్కర్లు మంగమ్మ, రాధ, యాదమ్మ, రాజేశ్వరి, రాణి పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి



వల్లభాపూర్ పాఠశాలలో పుస్తక పఠనం చేయిస్తున్న ఎంఈఓ బషీర్

లింగాల: విధి నిర్వహణలో సమయ పాలన పాటించాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిధిలోని మానాజీపేట, రాంపూర్, వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిసెంబర్‌లో నిర్వహించే పరీక్షల గురించి 3 నుంచి 6 తరగతుల విద్యార్థులకు సూచనలు ఇవ్వాలని ఉపాధ్యాయులను కోరారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. కులగణన సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

చారకొండ: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని గ్రామాల్లో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సునిత అన్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ విద్యాధరి, అధికారులు ఉన్నారు.

చర్మ వ్యాధులతో విద్యార్థుల అవస్థలు



మన్ననూర్: పీటీజీ పాఠశాలలోని విద్యార్థులు చర్మ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. ఒకే ప్రాంగణంలో కలిసి ఉన్న కళాశాల,పాఠశాల విద్యార్థులు సుమారు 400 మంది ఉన్నారు. ఈ క్రమంలో ప్రత్యేకించి ప్రాథమిక విద్య స్థాయిలో ఉన్న విద్యార్థులే అధికంగా గజ్జి, తామర, దద్దుర్లు వంటి చర్మ వ్యాధులతో బాధపడుతున్నట్లు వాపోయారు. సంబంధిత హౌస్ మాస్టర్, తరగతి ఉపాధ్యాయుడు, పీఈటీలు వ్యక్తిగత పరిశుభ్రత గురించి కొంత మేరకైనా పట్టించుకుంటే ఈ పరిస్థితి రాదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఇప్పటికైనా వ్యక్తిగత పరిశుభ్రతపై, విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. పాఠశాల,కళాశాల ప్రిన్సిపల్ గోవర్ధన్‌ను వివరణ కోరగా, స్పందించిన ప్రిన్సిపల్ వారంలో ఒకసారి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, సిబ్బంది వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎం కూడా విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. విద్యాపరంగా ప్రత్యేక తరగతులు తీసుకోవడం, తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల ప్రతిభను వ్యక్తిగతంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు నిర్వహించాలి



బీసీ రిజర్వేషన్లపై వినతి పత్రం అందజేస్తున్న కాశన్నయాదవ్

అచ్చంపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశన్న యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ విచ్చేసిన తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషనర్ బూసాని వెంకటేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయంగా తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. జనాభా తమాషా ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కార్తీక మాస పూజలు



లింగాల: మండల కేంద్రంలో, ఆయా గ్రామాల్లో ఆలయాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. కార్తీక మాసం పురస్కరించుకుని భక్తులు ఆయా దేవాలయాలను సందర్శించి ప్రతిరోజు వేకువజామున, సాయంకాలం దీపారాధనలు చేస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు.గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలలో రాత్రి సమయంలో ఆకు పూజలు నిర్వహిస్తున్నారు.

శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

మన్ననూర్: 20న హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించే కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోరె రేణయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధిని ఆకాక్షించేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. గాంధీ భవన్‌లో నిర్వహించే ఉత్సవాలకు సేవాదళ్ కార్యకర్తలందరు విధిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మధ్యాహ్న భోజనం పెండింగ్ బిల్లులు ఇవ్వాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం పెండింగ్ బిల్లులను ఇవ్వాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ అలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు కాశన్న మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో కార్మికులు విద్యార్థులకు భోజనం పెట్టడానికి నానా అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్మికులు గౌరమ్మ, మంగమ్మ, కృష్ణయ్య, రాములు పాల్గొన్నారు.

సకాలంలో నర్సరీలో విత్తనాలు నాటాలి



వెల్దండ మండలం తిమ్మినోనిపల్లిలో నర్సరీలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏపీఎం ఈశ్వర్‌జీ

వెల్దండ: నర్సరీలలో విత్తనాలను సకాలంలో నాటించాలని ఏపీఎం ఈశ్వర్‌జీ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తిమ్మినోనిపల్లి, కొట్ర గ్రామాల్లో ఏపీఎం ఈశ్వర్‌జీ నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లోని నర్సరీలలో విత్తనాలు నాటించడానికి కవర్‌బెడ్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నర్సరీకి 8500 మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. దాదాపుగా మండలంలో 2.72లక్షల మొక్కల పెంపకానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఉపయోగపడే విధంగా మొక్కలు ఎంచుకోవాలన్నారు. పూల మొక్కలు, అలంకరణ మొక్కలను పెంచి ఇంటింట అందించాలని సూచించారు. అనంతరం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టీఏ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

నిత్య అన్నదానానికి విరాళం

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన శ్రీ ఉమామహేశ్వరం ఆలయం నిర్వహిస్తున్న నిత్య అన్నదానానికి ఉప్పునుంతల మాజీ సర్పంచ్ దంపతులు కట్టా సరితా అనంతరెడ్డిలు రూ.25వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ బీరం మాధవరెడ్డి, కమిటీ సభ్యులు పవన్, దశరథం, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కిడిగుండం రోడ్డుకు మరమ్మతు చేయాలి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం రోడ్డుకు మరమ్మతు చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో ప్రజలతో కలిసి రోడ్డుపై నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుడికిల్ల గ్రామం నుంచి ముక్కిడిగుండం వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. అడవి సమీపంలో ఉన్న ముక్కిడిగుండం గ్రామ ప్రజలకు రాకపోకలు ఇబ్బందిగా ఉందన్నారు. దాదాపు 8 కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలు, గుంతలుగా ఉందన్నారు. నార్లాపూర్ సమీపంలో పెద్దవాగుపై నిర్మాణం చేస్తున్న హై లెవల్ బ్రిడ్జి కూడా త్వరగా పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉన్నారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు

ఉప్పునుంతల: ప్రస్తుతం యాసంగి పంటగా వరిని సాగుచేసే రైతులకు స్థానిక పీఏసీఎస్‌లో వరి విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందని పీఏసీఎస్ సీఈఓ రవీందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఎన్‌ఎం 1638 సన్నరకం వరి విత్తనాల బ్యాగు (25 కేజీలు) రూ.1005లకు, కేఎన్‌ఎం 118 దొడ్డురకం వరి విత్తనాలు బ్యాగు (25 కేజీలు) రూ.1000లకు, జేజీఎల్ 24423 దొడ్డురకం వరి విత్తనాలు (25 కేజీలు) రూ.995లకు, ఎంటీయూ 1010 దొడ్డురకం వరి విత్తనాలు బ్యాగు (25 కేజీలు) రూ.995లకు అందజేస్తున్నామని సీఈఓ తెలిపారు.

ఎస్సీ హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్సీ హాస్టల్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న వార్డెన్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు అదనపు కలెక్టర్ సీతారామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు తారాసింగ్ మాట్లాడారు. హాస్టల్‌లోనే మద్యం తాగుతూ విద్యార్థులను భయబ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తాం

చారకొండ: పాఠశాల విద్యార్థుల శుద్ధజలం అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తామని వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు అన్నారు. మండలంలోని జూపల్లి జెడ్పీహెచ్ఎస్‌ను సోమవారం సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు, తదితర వాటిపై విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడారు. వారి వెంట సాయి కుమార్, సిరాజ్ ఉన్నారు.

కృష్ణానది పరివాహక ప్రాంతం సందర్శన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరి సమీపంలో ఉన్న కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని ఎస్ఐ హృషికేష్, గ్రామ మాజీ సర్పంచ్ నిరంజన్ సందర్శించారు. కృష్ణానది బ్యాక్ వాటర్‌లో కొందరు వైజాక్ ప్రాంతానికి చెందిన బాల కార్మికులు జాలర్లతో కలిసి చేపల వేట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సందర్శన చేసినట్లు తెలిపారు. బాలకార్మికులతో చేపలవేట చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వలల యాజమానులకు ఎస్ఐ సూచించారు. జాలర్లకు చట్టాలపై కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

గ్రూప్–4లో జీడిపల్లి యువతికి ఉద్యోగం

కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన మాయావతి గ్రూప్–4లో ఉద్యోగం సాధించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికైంది. కూతురు ఉద్యోగం సాధించడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. మాయావతిని గ్రామస్తులు, బంధువులు అభినందించారు.

డీఈకి సన్మానం

కల్వకుర్తిరూరల్: పంచాయతీరాజ్ కల్వకుర్తి డివిజనల్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టిన స్వరాజ్యలక్ష్మిని సోమవారం కల్వకుర్తి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి పాండుగౌడ్ ఆధ్వర్యంలో స్వరాజ్యలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో భానుచందర్, నవీన్, మహేందర్, అరవింద్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎస్ఐపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి



కొల్లాపూర్: గత ప్రభుత్వ హయాంలో కొల్లాపూర్ ఎస్ఐగా పనిచేసిన బాల వెంకటరమణపై సస్పెన్షన్ వేటు పడింది. ఆయన కొల్లాపూర్ ఎస్ఐగా పనిచేసిన సమయంలో తమను వేధించారని, ఉద్యోగ బాధ్యతలను దుర్వినియోగం చేశారని, ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ కొల్లాపూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ముందు కొందరు నాయకులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో అవుట రాజశేఖర్, రాందాసు, శంకర్‌నాయక్, నాగరాజు, బాలరాజు, సందీప్, శివ, సత్యనారాయణ తదితరులున్నారు.

వికలాంగుల దినోత్సవం నిర్వహించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: డిసెంబర్ 2న జరిగే వికలాంగుల హక్కుల దినోత్సవాన్ని అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలలో నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ ఏఓ చంద్రశేఖర్‌కు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రతియేట జరిగే వికలాంగుల దినోత్సవాన్ని ఈ పర్యాయం అన్ని మండలాల్లో జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కురుమయ్య, పుల్జాల బాలీశ్వర్, స్వామి, లింగంగౌడ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

తిమ్మాజిపేట: సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతోంది. ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు.